ఆంధ్రభూమి వారపత్రిక వారి కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# గాంధీతాత నవ్వేడు



"కొంచెం కన్సెషన్ ఇవ్వండి సార్. ప్లీజ్......."

రామారావు అర్థింపుకి చిరునవ్వు సమాధానంగా ఇచ్చాను.

"ఇబ్బందుల్లో ఉన్నాను. పదివేలు కూడబెట్టడం చాలా కష్టమైంది....."

"చూడు రామారావ్, పనిచేసిపెట్టమని నెలరోజుల్నుంచి తిరుగుతున్నావ్. కీలకం నా చేతుల్లో ఉందని నీకు తెలుసు. ఆ పని నీకెంత ముఖ్యమో నాకు తెలుసు. అయినా మొదట చెప్పిందాని కన్నా ఒక్కటంటే ఒక్క రూపాయి ఎక్కువడిగానా? లేదు కదా? మరి డిస్కౌంటెలా ఇస్తానోయ్.....!"

"తప్పదంటారా?"

"ఇంకోదారి నాకూ లేదు, నీకూ లేదు"

మొఖం ముడుచుకుని జేబులోంచి ఫెళఫెళలాడుతోన్న వెయ్యి నోట్లు తీసి గబుక్కున నా రైటింగ్ ప్యాడ్ క్రింద కుక్కాడు.

'లంచం ఇవ్వటం కొత్త కాబోలు!' అనుకుంటూ ఆ నోట్లు తీసుకుని లెక్కపెట్టాను. పది. అన్నీ కొత్తవే. నా పబ్లిక్ చేష్టకి అతడు విస్తుబోయి చూస్తోంటే తాపీగా జేబులో పెట్టుకున్నాను.

ఎక్కడెక్కడ్నుంచో పోగుచేశానంటూనే కొత్తవి తెచ్చిచ్చాడు...కొంపతీసి ఏసీబీ వాళ్ళని వెంటేసుకుని రాలేదు కదా?

గాబరా పడుతూ చుట్టూ చూశాను. ఆగంతకులెవరూ లేరు. రావట్లేదు. ఎందుకైనా మంచిదని గబగబా బాత్‌రూంలోకెళ్ళి నోట్లని కట్‌డ్రాయర్లో దాచేసి వచ్చాను.

"డబ్బు సరిపోయింది కదండీ"

"పదే కదుటోయ్! నోట్లకి ఆ విలువ ఎలా వచ్చిందో తెలుసా రామారావ్?"

"గాంధీగారి బొమ్మ ఉన్నందునండి"

"ఎగ్జాక్ట్‌లీ. గాంధీ బొమ్మ చూసే నోట్లకి విలువిస్తున్నాం. ఆయనకి తప్ప మనకి విలువ ఎక్కడిది చెప్పు?! ఆయన బొమ్మ ప్రింటు చేయలేదనుకో అప్పుడెవరూ వాటిని కరెన్సీ నోట్లుగా గుర్తించనే గుర్తించరు!"

పెద్దగానే నవ్వాను. లోపల దాచుకున్న పదివేలు కిక్కిస్తోంది మరి!

"నా పర్మిషన్ పేపరు........."

"వెయిట్ వెయిట్. ఇదంతా నేనే మింగేస్తాననుకుంటారు నీలాటివాళ్ళు. ఎవరికెన్ని వాటాలివ్వాలో ఇవ్వకపోతే ఎన్ని పాట్లు పడాలో మీకు తెలీదు...."

రామారావు ఫైలు ఎదురుగానే వుంది. అయినా సరే అన్ని ఫైళ్ళూ వెదకి ఆఖరికి దాన్ని బయటికి తీశాను. ఆ ఫైలు క్లియర్ కావడానికి నేనెంత బాగా డ్రాఫ్టింగ్ చేశానో ఎన్ని ఉదాహరణలు కోట్ చేశానో వివరిస్తూ అనుమతి పత్రాన్ని అతడి చేతుల్లో పెట్టాను.

అతడి కళ్ళు మెరిశాయ్. దణ్ణం పెట్టి లేచాడు.

నా వంక ఆశగా చూస్తూ కన్పించాడు బంట్రోతు మస్తాన్. వెళ్ళబోతున్న రామారావుతో "పాపం అతడికేదో కాస్త విదిలించవోయ్" అన్నాను చేత్తో చూపిస్తూ.

యాభై నోటిచ్చి వెళ్ళిపోయాడు.

మస్తాన్ మొఖంలో పదివాట్ల బల్బే వెలిగింది. నాకిచ్చిన సొమ్ముని అతడి డేగ కళ్ళు లెక్కించి వుంటాయి!

ఇంటర్‌కమ్‌లో ఆఫీసర్ పిలవగా అయిష్టంగా లేచి వెళ్లి విష్ చేశాను.

"మురళీ! మా అమ్మాయీ అల్లుడూ తిరుపతి వెళ్తార్టోయ్. రానూ పోనూ రెండు త్రీ టయర్ ఏసీ టిక్కెట్లు బుక్ చేయించు. పేర్లు తెలుసుగా...."

"తెలుసండి. ప్రతీసారీ టిక్కెట్లు బుక్ చేయిస్తున్నది నేనేగా!!"

"ఇప్పుడే మస్తాన్ని పంపించు. తర్వాత మర్చిపోకుండా అడిగి డబ్బు తీసుకో. ఎవరికెంత ఇవ్వాలో ఏమీ నాకు గుర్తుండి చావదు. మీరేమనుకుంటారో ఏమో!"

'టాక్సేషన్ అనుకుంటాం' అని లోలోపల తిట్టుకుంటూ, వినయంగా తలాడించి వచ్చేశాను.

మళ్లీ బాత్‌రూంలోకెళ్ళి లోపల్నుంచి డబ్బుతీసి పర్సులో కుక్కాను. పది వేలలోంచి రెండు వేలు తీసి మస్తాన్‌కిచ్చాను 'కృష్ణార్పణం' అనుకుంటూ.

మా ఆఫీసరంత పరమ లుచ్చా ఎక్కడా ఉండడు. పైకి నీతిమంతుడ్నంటూ లెక్చర్లిస్తాడు. జేబులోంచి రూపాయి తియ్యకుండా అవీ ఇవీ తెమ్మంటాడు. పైగా మర్చిపోకుండా అడిగి తీసుకోండంటూ తాళింపూ పెడతాడు – పేద్ద ఇచ్చేసేవాళ్ళా!

పొద్దుట లేవగానే ఎవరి మొహం చూశానో రెండువేలు క్షవరం!

"మొఖంలో పేలాలు వేగుతున్నాయేంటి" కొలీగ్ భానుమూర్తి అడిగాడు.

"గురుడు రెండువేలకి టెండరేశాడు"

"బతికిపోయావ్. మొన్న వరలక్ష్మీ వ్రతానికి పూజాసామాగ్రి తెమ్మంటూ ఇంత లిస్టు చేతిలో పెట్టాడు. బిల్లు నాలుగువేల మూడొందలైంది!"

"గొప్ప సుడిగాళ్ళే......టీ త్రాగొద్దాం పద"

క్యాంటీన్లో టీ త్రాగుతోంటే ఆటో మీద హడావిడిగా వచ్చాడు మా పొరుగింటి విశ్వనాథం.

"అంత కంగారుగా వున్నారేంటి" ఎదురెళ్ళి అడిగాను.

"స్కూటర్ని ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. ఇన్సూరెన్సూ పొల్యూషన్ సర్టిఫికెట్టూ లేవు. అయిదొందలిస్తేగాని వదలనన్నారు. జేబులో చిల్లరే వుంది. దగ్గర్లోనే మీ ఆఫీసుందని గుర్తొచ్చి వచ్చాను. కొంచెం సర్దు మురళీ సాయంత్రం ఇంటికి రాగానే ఇచ్చేస్తాను......"

పర్సులోంచి వెయ్యి నోటు తీసి మార్చబోతుంటే, "వెయ్యా ఇవ్వు. మళ్ళీ ఏదైనా మడత పేచీ పెడితే వుంటుంది" అంటూ దాన్ని తీసుకుని థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు.

సీట్లో కూర్చున్నానో లేదో చందా పుస్తకాలతో ఓ నలుగురొచ్చారు.

ఏదో కాలనీలో సాయిబాబా మందిరం నిర్మిస్తున్నారట. తోచిన చందా ఇమ్మన్నారు.

లేదనడానికి నోర్రాలేదు. పైగా ఇవాళ గురువారం. సాయి మీద నాకూ అంతో ఇంతో నమ్మకం భక్తీ వున్నాయాయె!

"అయిందొందలు రాయండి..."

వెయ్యి నోటిచ్చాను. అయిదు వంద కాగితాలు తిరిగిచ్చారు. రసీదులోని బాబా ఫోటో వంక చూశాను. చల్లగా చూస్తున్నాడు. పాపపరిహారమైనట్టు అనుభూతించాను.

ఆఫీసయ్యాక వెళ్ళబోతోంటే గేటు దగ్గర శారదగారు కన్పించారు. ఈ నెలలో గోల్డ్ స్కీం వాయిదా కట్టలేదని గుర్తొచ్చింది.

రెండువేలు తీసిచ్చి "మన జ్యూవలరీ షాపులో గోల్డ్ స్కీంలో కట్టండి మేడమ్. మా ఆవిడ పేరు గుర్తుందిగా" అన్నాను.

"గుర్తుందిలెండి.. ఇవాళ చాలా హుషారుగా ఉన్నారు. వలలో పెద్ద చేప పడిందా?" కళ్ళు చికిలించి నవ్వుతూ అడిగింది. సీట్లోంచి కదలదు గాని ఆఫీసు సంగతులన్నీ ఆవిడకి చిత్రంగా తెలిసిపోతూంటాయ్!

"మోస్తరు చేప" నవ్వాను.

"మీ సీటు కామధేనువులెండి" నిట్టూరుస్తూ అంది.

అక్కడికి తనది తక్కువైనట్టు! బ్రతిమాల్తే మేం 'రేటు' తగ్గిస్తాం గాని తను పైసా కూడా తగ్గదు! సిటీలో అన్ని వైపుల్నా ప్లాట్లు కొనేసిందంటే ఆశ్చర్యమేముందీ!

వెర్రిగా నవ్వి బైక్ స్టార్ట్ చేశాను.

"వచ్చేరా. మీకోసమే చూస్తున్నాను" అంది రమ గుమ్మంలోనే ఎదురై.

"డబ్బు అవసరపడిందన్నమాట"

"సూపర్ బజార్కెళ్ళి వెచ్చాలు తేవాలి. రెండు వేలివ్వండి"

"మొన్న ఫస్ట్వీక్లోనే కదా కొనుక్కొచ్చావ్. అప్పుడే అయిపోయాయా!"

"ఎవరిదో పెళ్లంటూ మీ దండు వచ్చిపడిందిగా! నాల్రోజుల్లోనే ఇల్లు గుల్ల చేసి పోయారు!" నిష్ఠూరంగా అంది.

మారు మాట్లాడకుండా అడిగినంతా ఇచ్చాను.

లక్ష్మీదేవి చాలా చంచలమైంది. ఒక్కచోట ఒక్కరోజు నిలకడగా ఉండదు కదా!

సుపుత్రుడు బయటికెళ్ళబోతూ నన్ను చూసి ఆగాడు.

"ఇప్పుడెక్కడికిరా తయారయ్యావ్"

"ఫ్రెండ్సందరం సరదాగా రెస్టారెంట్లో కలుద్దామని ప్లాన్ చేసుకున్నాం డాడ్"

"రోజూ కాలేజీలో కలుస్తూనే ఉన్నారుగా!"

"వీళ్ళు హైస్కూల్ ఫ్రెండ్స్....."

"సర్లే. మమ్మీ సూపర్ బజార్‌కెళ్ళింది. నేను స్నానం చేసొచ్చేదాకా ఆగు. ఈలోగా విశ్వనాథం అంకుల్ వస్తే కూర్చోమని చెప్పు"

ఎలాంటి గొణుగుడూ లేకుండా తలాడించి టీవీ రిమోట్ చేతిలోకి తీసుకున్నాడు.

మరి రెండు గంటలకి ధుమధుమలాడుతూ బజార్నుంచి వచ్చింది రమ.

మొఖం ఎర్రగా ఉబ్బి వుంది. ముక్కు పుటాలదుర్తున్నాయి. కన్నీళ్ళు పొంగి వస్తున్నాయ్.

తనకిచ్చిన రెండు వెయ్యి నోట్లనీ నా మీదకి విసిరేస్తూ , "ఎక్కడ్నుంచి కొట్టుకొచ్చారీ దొంగనోట్లు?" అంది రోషంగా బుసలుకొడుతూ.

"దొ.....దొంగనోట్లా?" నోట్లని చేతిలోకి తీసుకుంటూ అప్రతిభుడ్నై చూస్తూ అడిగాను.

"కాకపోతే దొరనోట్లనుకున్నారా? మీరు లంచాలు మేస్తారని తెలుసుగాని ఇలా దొంగనోట్లు మారుస్తారని నాకింతదాకా తెలీదు......."

"అసలేవయ్యిందే........."

"ఇంకేమవ్వాలి? అందరి ముందూ మెడబట్టి బయటికి గెంటేశాడు. 'దొంగనోట్లు తెచ్చి ఎవర్ని బురిడీ కొట్టిద్దామనుకున్నావే' అని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు. ఇంకోసారటువేపొస్తే పోలీసులకి పట్టిస్తానని హెచ్చరించాడు. అంతా నన్నో దొంగలా చూస్తోంటే ఏ బస్సుకిందైనా పడి చచ్చిపోవాలన్పించింది"

బరస్టయ్యింది.

రమ హోరున, భోరున విలపిస్తోంటే ముచ్చెమటల్తో నిలువునా తడిసిపోతూ అదుర్తోన్న చేతుల్తో కొత్త వెయ్యి రూపాయల నోట్ల వంక చూశాను. కంపిస్తూనే ఇంతింత కళ్ళతో పరీక్షించాను.

గాంధీ బొమ్మ వుంది. సెక్యూరిటీ మార్కూ వున్నట్టే వుంది. మరిదెలా దొంగ నోటైంది? కాగితం కాస్తంత దళసరిగా ఉన్నట్టుంది....ఈ మాత్రానికే......!

ఏదో గుర్తురాగా తెల్లని భాగాన్ని లైటుకాంతికి అడ్డం పెట్టి చూశాను.

గుండె గుభిల్లుమంది.

అక్కడ ఉండాల్సిన గాంధీబొమ్మ లేదు!

అయితే.....అయితే.....ఇది దొంగనోటా? పదివేలు కక్కందే శాంక్షన్ లెటర్ ఇవ్వనన్నానని కక్ష గట్టి రామారావు దొంగనోట్లు తెచ్చి నా మొఖాన కొట్టాడా?

భయం పాము మెదడులోంచి ఉరికి నిలువెల్లా జరజర పాకుతోంటే వజవజ వణికి పోయాను.

ఆఫీసర్ కూతురూ అల్లుళ్ళ రైలు టిక్కెట్ల కోసం వెళ్ళిన మస్తాన్......

ట్రాఫిక్ పోలీస్‌కి లంచమివ్వడానికి ఒక నోటు తీసుకెళ్ళిన విశ్వనాథం...

ఒక నోటు తీసుకుని అయిదొందలు తిరిగిచ్చిన సాయి భక్తులు.....

గోల్డ్ స్కీంలో కట్టడానికెళ్ళిన శారద మేడమ్....

కళ్ళు గిర్రున తిరుగుతోంటే మరి నిలబడగల శక్తి లేక సోఫాలో కూలబడ్డాను. బీపీ పెరిగి పోతోంటే తల వెనక్కి వాల్చి నిస్సహాయంగా చూశాను.

కంగారు పడుతూ పరుగెత్తుకొచ్చింది రమ.

"ఏమైందండీ....."

ఏవీ లేదంటూ సైగ చేశాను.

"గుండెల మీద చెయ్యి పెట్టుకున్నారేం?గుండె పోటొస్తోందా ?"

"నథింగ్....ఏం లేదు......"

మంచినీళ్ళు తెచ్చిస్తూ, "ఏ పాపిష్ఠి వెధవండీ ఆ దొంగనోట్లు మీకు అంటగట్టిందీ!" నిలదీసింది.

నేను జవాబివ్వక పోయే సరికి, "కొత్త కష్టమరా?" అనడిగింది.

తలాడించాను

"వాడేం బాగుపడతాళ్ళెండి. మీ ఉసురు పోసుకుని మట్టిగొట్టుకు పోతాడు. అయినా ఇవాళ రేపు రోజులు బాగాలేవు. ఎవర్ని బడితే వాళ్ళని నమ్మకండి. కసితో కేసుల్లో ఇరికించెయ్యాలని చూస్తున్నారు మాయదారి జనం !"

అదిరిపడి చూశాను. నా గుండె శబ్ధం నాకు స్పష్టంగా విన్పించేంతగా పెరిగిపోయింది.

రామారావు.....! ఎంతో మర్యాదస్తుడిగా నటించేవాడు. లంచం ఇస్తేగాని అతడి ఫైలు ముట్టనన్నానని కక్షతో దొంగనోట్లిచ్చాడా? నన్ను కటకటాల వెనక్కి తోసెయ్యాలని కుట్ర పన్నాడా?

అంతే అయ్యుంటుంది. లేక...అవి దొంగనోట్లని అతడికే తెలీదేమో పాపం?! అనవసరంగా అతడి శీలాన్ని శంకిస్తున్నానేమో?

అద్సరే–ఇప్పుడెలా ఈ గండం నుంచి బయట పట్టం?

గుండెల్లో సినీ ఫ్యాక్షనిస్టుల వైట్ సుమోలు గాల్లోకి ఎగిరి పేల్తున్నాయి !

ఆఫీసర్, విశ్వనాథం, సాయిభక్తులు, శారద...... కళ్ళ ముందు గిర్రున తిరిగారు. బాధ, భయం, దు:ఖం ముంచెత్తాయ్.

సాయినాథా! పాహిమాం! నువ్వే నన్ను రక్షించాలి. ఈ గండం నుంచి బయట పడెయ్యి. షిర్డీ వచ్చి నీ దర్శనం చేసుకుంటాను తండ్రీ!

ఒళ్ళంతా ముచ్చెమటల్తో తడిసి ముద్దయ్యింది. ఏదో గుర్తు రాగా గబగబా మస్తాన్‌కి ఫోన్ చేశాను.

"ట్రెయిన్ టిక్కెట్లు తీసుకున్నావా?"

"లేదుసార్. వెయిటింగ్ లిస్ట్ నడుస్తోంది. సార్ వద్దన్నారు"

"నేనిచ్చిన డబ్బు నీ దగ్గరే ఉందా?"

"లేదు సార్. సార్‌కిచ్చేశాను...."

"చచ్చేం!"

"ఏవయ్యింది సార్?"

"గోడకి కొట్టిన సున్నం, అంతే. ఇంకేం లేదులే.....!"

లైన్ కట్ చేశాను. ఆఫీసర్ రూపం కళ్ళ ముందు కదిలింది. అతడు నమ్మదగినవాడు కాదు. అవకాశం చిక్కితే చాలు గాలిని సుడిగాలిగా మార్చగల సమర్థుడు!

మరొక్క క్షణం ఆలస్యం చెయ్యకుండా భార్య పిలుపుల్ని పట్టించుకోకుండా దూసుకెళ్ళి బైక్ స్టార్ట్ చేశాను.

తిన్నగా ఆఫీసరింటికెగిరి వెళ్ళి వాలాను.

లుంగీ బనీను ధరించి, టీపాయ్ మీద మందు సామాగ్రి పెట్టుకుని, తాపీగా సిప్ చేస్తున్నాడు గురుడు.

నా వంక విసుగ్గా చూశాడు.

"సారీ సర్......నా మిస్సెస్‌కి సీరియస్‌గా వుంది. హాస్పటల్లో చేర్చాను. అర్జంటుగా హాస్పటల్లో డబ్బు కట్టాలి. నేనిచ్చిన రెండు వేలూ ఇస్తే...."

ఆయన కళ్ళతోబాటు ముఖమూ ఎర్రబడింది. "రేపిస్తాన్లే"

"యమర్జంటు సార్....మస్తాన్ తెచ్చిచ్చిన నోట్లిస్తే చాలు సార్........"

"అవి లేవోయ్"

"ఖర్చు పెట్టేశారా సార్.........?" కీచుగా అరిచాను.

"మా బామ్మర్ది ఊరికెళ్తూ అడిగితే ఇచ్చేనోయ్. నీ సొమ్మేం మింగెయ్యన్లే. రేపు ఆఫీసుకొచ్చేక అడుగు విసిరి పారేస్తాను...."

"అది కాద్సార్. ఆ నోట్లే కావాలి..."

బొజ్జ అదిరేలా నవ్వేడు. "ఏ నోటైనా డబ్బేనోయ్. ఇవి నీతిగా సంపాదించిందా అవినీతితో సంపాదించిందా అని దాని మీద ముద్రేసి వుండదు. నల్ల డబ్బూ తెల్లగానే వుంటుందోయ్!"

"అవున్సార్. కాని నాకు ఆ నోట్లే కావాలి......"

"కొంపతీసి నోట్లనీ లాటరీ టిక్కెట్లుగా మార్చేశారేంటి?" బిగ్గరగా నవ్వాడు.

అమాంతం ఆయన మీద పడి పీక పిసికెయ్యాలన్నంత కోపం వచ్చింది. దాన్ని అదిమి పడుతూ, "ఆ నోట్లమీద ఇంపార్టెంట్ కోడ్ నెంబర్లు రాసుకున్నాన్సార్. అందుకని..." నీళ్ళు నములుతూ అన్నాను-లోలోపల బిగ్గరగా ఏడ్చేస్తూ.

"ఓస్ ఆ మాత్రానికే ఇంత రాద్ధాంతం ఎందుకోయ్. ఇప్పుడే మా బామ్మర్దికి ఫోన్ చేస్తానుండు......."

"ఆయనెక్కడున్నారో చెబితే నేవెళ్ళి తెచ్చుకుంటాన్సార్. వేరే నోట్లు ఇచ్చి తెచ్చుకుంటాను......."

నన్నో పిచ్చివాళ్ళా చూస్తూ ఫోన్ చేశాడు. "ఎక్కడిదాకా వెళ్ళేవు.....!"

"కోదాడ దాటేను. ఏం బావా?"

"నీకిచ్చిన నోట్లమీద మా ఆఫీసు అసిస్టెంటు ఏవో జీవో నెంబర్లు రాశాట్ట. చూసి చెప్పు నోట్ చేసుకుంటాడు....."

సెల్ నాచేతికిచ్చాడు. వణకుతూ దాన్ని చెవి దగ్గర పెట్టుకున్నాను

"కొత్త నోట్లు బావా. ఏమీ రాసిలేదు......"

మారు మాట్లాడకుండా కట్ చేసి నీరసంగా సెల్ అందిచ్చాను.

"ఇప్పుడే హత్యచేసి వచ్చిన వాళ్ళా వున్నావేంటోయ్ కథ?"

"నా పని అంతకంటే ఘోరంగా వుంది సార్. వస్తాన్సార్....."

కాళ్ళీడ్చుకుంటూ బయటికి నడిచాను.

సదరు బామ్మర్ది రేపు ఎలాంటి బాంబు నా మీదకి విసరనున్నాడో దేవుడా !

దు:ఖం పొంగి వచ్చింది. బైక్ స్టార్ట్ చెయ్యబోతూ విశ్వనాథానికి ఫోన్ చేశాను అతడెలాటి పిడుగు వేస్తాడోనని వణకిపోతూనే.

"ఇప్పుడే వెయ్యి మీ ఇంట్లో ఇచ్చాను....."

"నేనిచ్చిన వెయ్యా ఇంకో వెయ్యా?"

"నువ్విచ్చింది వెయ్యే కదా"

"అహహ. నా ఉద్దేశం అది కాదు. నేనిచ్చిన వెయ్యి నోటిచ్చారా ఇంకోటా అని?"

"నువ్విచ్చింది ట్రాఫిక్ పోలీస్‌కిచ్చేశానుగా!"

"పుచ్చుకున్నాడా?"

"మహరాజులాగా. అయిదొందలకి ఒక్క రూపాయి తగ్గలేదు. కాలం దారుణంగా మారిపోయిందనుకో......."

"సరి సరే......"

మనస్సులో ఆనందతరంగం ఉవ్వెత్తున లేచి పడింది.

అయితే ట్రాఫిక్ పోలీసులు దొంగనోటుని గుర్తించలేదన్నమాట. ఎలా గుర్తిస్తార్లే. దొర నోటుకన్నా జబర్దస్తీగా ఉంది. ఒకవేళది దొంగనోటు కాదేమో? సూపర్ బజార్ వాడే పొరబడ్డాడేమో?

పాయింటే. అదే నిజమైతే నేనింతగా క్రిందా మీదా పడటంలో అర్థంలేదు. మంచినోటో కాదో నిర్ధారణ చేసుకోకుండా ఇలా బెంబేలు పడటం ఒకటో రకం ఫూలిష్‌నెస్!

ఊహూ. నోటుని పరీక్షగా చూశానుగా. తెల్లని ప్రదేశంలో గాంధీగారి బొమ్మలేదుగాక

లేదు!

పెదవి కొరుక్కుంటూ బైక్ స్టాండ్ తీశానో లేదో సెల్ మ్రోగింది.

"పోలీస్ స్టేషన్నుంచి సిఐని మాట్లాడుతున్నాను....."

గజ గజ వణకిపోయాను. "సా.........సార్........."

"నువ్వర్జంటుగా స్టేషన్కిరా......"

"అ.... అలాగే సార్. వచ్చేస్తాన్సార్....."

అయిపోయింది. నా పని ఖతం. బహుశా ట్రాఫిక్ పోలీసులు దొంగనోటుని స్టేషన్లో అప్పగించి ఉంటారు!

ఎలాంటి చావొచ్చి పడిందిరా దేవుడా!

బుద్ధి గడ్డి తిని గడ్డి మేసినందుకు పరువూ మర్యాదా గౌరవం మట్టిగొట్టుకు పోవడమే కాదు జైల్లో వూచలు లెక్కపెడుతూ చిప్పకూడు తినాల్సిన ఖర్మ పట్టబోతోంది! ఊరూ వాడా బంధువులూ మిత్రులూ తెలిసినవాళ్ళూ తెలీనివాళ్ళూ అంతా నా ముఖం మీద ఉమ్మేస్తారు! దొరికిందే సందని టీవీ ఛానళ్ళ వాళ్ళు పదే పదే నన్ను చూపిస్తూ బ్రేకింగ్ న్యూస్‌లు అల్లుతారు!

ఎవరో ఎడాపెడా కర్రతో బాదినట్టు అనుభూతి కలిగింది. బిక్క చచ్చిపోయాను.

ఆ కర్ర గాంధీతాతదా?

మా హైస్కూల్ ఆవరణలో గాంధీ తాత విగ్రహం ఉండేది. ఆయన చేతిలోని కర్ర నన్నెప్పుడూ అబ్బురపరుస్తూండేది.

ఓసారి "హింస వద్దన్న గాంధీ తాత చేతిలో కర్ర వుందేంటండీ" అని మా మాస్టారిని అడిగాను.

"తప్పుడు మార్గాన వెళ్ళే వారిని హెచ్చరించడానికిరా. అవసరమైతే దండించి దార్లో పెట్టడానిక్కూడా. బాగా గుర్తుపెట్టుకుని బుద్ధిగా మసలుకో. పైకొస్తావ్"

అప్పుడు బుద్ధిగా తలాడించినా ఉద్యోగంలో చేరేక, జనం అవసరార్థం నా చుట్టూ తిరగటం మొదలయ్యాక, అర్థాంతరంగా ధనవంతుడ్నీ తద్వారా గొప్పవాడ్నీ అయిపోవాలనుకున్నాక లంచాలు మరిగాను. జీతాన్ని టిప్పుగా చూడటం మొదలెట్టాను. కరెన్సీ నోట్ల రెపరెపల్లో సుఖాన్ని ఆనందాన్ని చూసుకుంటూ వచ్చాను.

అలాంటిదివాళ ఎత్తి కుదేసినట్టు...నెత్తిమీద ఇనుప పాదం మోపి 'వామనుడు' తొక్కేస్తోంటే పాతాళంలోకి – లోలోపలికి – పోతున్నట్టు...!

కన్నీటి తెరల్లోంచి 'దారి' సరిగ్గా కన్పించట్లేదు. అయినా ఎలా వెళ్ళి స్టేషన్లో పడ్డానో నాకే తెలీదు.

ఇన్స్‌పెక్టర్ దగ్గరికెళ్ళి వణకుతూ విష్ చేశాను.

ఎందుకో అతడివెనకాలున్న లాకప్ రూం వంక చూసినవాడ్నల్లా అందులో వున్న

మా అబ్బాయిని చూసి అదిరిపడ్డాను.

"మా అబ్బాయి సార్...."

"ఆс మీవాడే. అతగాడిప్పుడు పెద్ద చలాకీ అయ్యాడు"

"ఏం చేశాడ్సార్....?!"

"దొంగ నోట్లు మారుస్తున్నాడు"

నా నడినెత్తిన పిడుగు పడింది.

"దొ...దొంగనోట్లు?"

"ఆс ఆ రాకెట్ గురించి చెప్పమంటే నోరు విప్పడు. నాలుగు తగిలించే సరికి మీ జేబులోంచి కొట్టేశానన్నాడు. మీలాంటి పెద్దమనిషి మీద అభాండం వేస్తున్నాడు చూడండి. మీరూ గవర్నమెంటు ఉద్యోగే కదా, ఇందులోని సాధక బాధకాలు మీకు బాగా తెలుసుగా? అడిగి చూడండి చెబుతాడేమో. లేకపోతే కేసుల్లో పీకల్లోతు కూరుకుపోతాడు. ప్రభుత్వ ఉద్యోగాలకి పనికిరాకుండా పోతాడు!"

దొంగ ఊబిలోకి దిగబడిపోతున్నట్టూ ఊపిరాడనట్టూ ఉంది.

విల విల్లాడిపోతూ, "ఆ నోట్లేవండి...." అతి కష్టం మీద నోరు పెగల్చుకుని అడిగాను.

రెండు నోట్లు సొరుగులోంచి తీసి టేబుల్ మీద లాఠీ క్రింద పెట్టాడు ఇన్‌స్పెక్టర్.

సందేహం లేదు. అవి రామారావిచ్చినవే. నేను స్నానానికెళ్ళినప్పుడు నా జేబులోంచి నా సుపుత్రుడు తస్కరించి ఉంటాడు.

ఆ నోట్లవంక పిచ్చిగా వెర్రిగా చూశాను.

అవి నోట్లు కాదు. పిచ్చి కాగితాలు. చిత్తు కాగితాలు. ప్రాణం లేని రంగు కాగితాలు. వాటి వెంటపడి, వాటి కోసం ప్రాకులాడి, వాటినే ప్రాణప్రదంగా భావించి, భ్రమించి ఎన్ని విలువల్ని కోల్పోయాను! ఎలాంటి విషమస్థితిలో చిక్కుకున్నాను! ఒక్కగానొక్క కొడుకుని ఎంత దారుణపు విషాదంలోకి నెట్టాను !

ఫ్యాన్ గాలికి కొత్త నోట్లు ఎగిరెగిరి పడుతున్నాయి.

దిక్కు తోచక, దరీ దారీ కన్పించక దిగ్భ్రమతో వాటి వంకే వెర్రిగా చూస్తూండిపోయాను.

నోట్ల మీది గాంధీతాత, నన్నూ నా అవస్థనీ నా విషాదాన్నీ నా పతనాన్నీ చూసి నవ్వుతున్నాడు – జాలిగా బాధగా ఆవేదనగా !

(ఆంధ్రభూమి వారపత్రిక 4.7.2013)